వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 23 మే 2025

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి, మే 22 ప్రభాతవార్త**



జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాధర్బర్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మంత్రి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

## యోగాతోని సంపూర్ణ ఆరోగ్యం

**పీలేరు మే 22 ప్రభాతవార్త :**



మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఆ మనిషి మనుగడ కూడా జీవనం సహజంగా సాగుతుందని పీలేరు పంచాయతీ ఈవో గురు మోహన్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రోజు నుండి 30 రోజులపాటు ఉచితంగా యోగ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఒక గంట పాటు నిర్వహిస్తున్నామని దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈవో అన్నారు. అలాగే యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం పని భారం వల్ల యోగ చేయలేకపోతు అనారోగ్యం పాలవుతారు కావున ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంతృప్తి ఆరోగ్యం లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా మనిషి మనుగడకు ఆరోగ్యం ఎంతో అవసరమని మనిషి ఉన్నత స్థితికి ఎదగడానికి కూడా అష్ట ఐశ్వర్యాలకున్న ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని ఆయన అన్నారు.

# మహానాడులో సత్తా చాటుదాం

- రాజకీయ వ్యభిచారులకు బుద్ధి చెబుతాం
- పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం
- వీరబల్లెకు హంద్రీనీవా నీరు
- రాజంపేటకు మెడికల్ కాలేజ్, అన్నమయ్య ప్రాజెక్టు
- సుండుపల్లెకు ఝరికొన ద్వారా సాగునీరు
- రాజంపేట మినీ మహానాడు సూపర్ సక్సెస్
- టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు



జ్యోతి ప్రజ్వలనతో మినీ మహానాడు ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

**రాజంపేట అర్బన్, మే22 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ అంటేనే ప్రజల గొంతుక అని, ఆత్మగౌరవంతో పుట్టిన పార్టీ అని, మహానాడు అంటే పార్టీకి దిశా నిర్దేశం చేసే ప్రధాన వేదిక అని, అందులోనూ మన జిల్లాలోనే జరుగుతున్న నేపథ్యంలో రాజంపేట సత్తా చాటేలా తరలి వెళ్దామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహానాడులో సత్తాచాటి, అనంతరం పార్టీ అధినేతను కలిసి రాజంపేటకు సముచిత స్థానం ఇవ్వాలని పార్టీ పదవుల్లో న్యాయం చేయాలని కోరుతామని ప్రకటించారు. పార్టీని అస్థిరపరిచే రాజకీయ వ్యభిచారులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి మినీ మహానాడులో తీర్మానం చేశారు. గురువారం రాజంపేట పట్టణంలోని ఏబి చంద్రారెడ్డి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమం సూపర్ సక్సెస్ అయింది. మహానాడుకు తెలుగు తమ్ముళ్లు పోటెత్తారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వల చేసి మినీ మహానాడును ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ రాజు మాట్లాడుతూ వైసిపి వారికి వైసీపీ పార్టీ కంటే టిడిపి పార్టీ అంటేనే చాలా ప్రేమ అని, అందుకే ఎప్పుడు టిడిపి నామస్మరణ చేస్తూ టిడిపిని భ్రష్టు పట్టించేందుకు కొందరు ద్వారా రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీలో కొనసాగుతున్న ఏ నాయకుడు రాజకీయ వ్యభిచారాలకు లొంగరని, అందుకే రాజంపేట నియోజకవర్గంలోని ప్రతి నాయకునికి కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కరిస్తూ కలిసి పని చేద్దాం రాజంపేటలో పసుపు జెండా ఎగరేద్దాం, చంద్రబాబు నాయుడు ,లోకేష్ మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడదాం అంటూ ఆయన శ్రేణులకు సూచించారు. తనకు వ్యక్తిగత ఎజెండాలు ఏమీ లేవని, తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు, బలోపేతం, కార్యకర్తలకు అండగా ఉండడం, అధిష్టానం ఆదేశాలు పాటించడం, నిరంతరం అందుబాటులో ఉండడమే తన లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో కొనసాగడం, మార్గదర్శకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం, భవిష్యత్ నాయకుడు నారా లోకేష్‌కి సహకారంతో బాధ్యతలు నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, గతంలో తెలుగుదేశం పార్టీని విచ్ఛిన్నం చేయడానికి కొందరు నాయకుల ప్రయత్నాలు ఫలించవని, అందరం కలిసికట్టుగా పనిచేసి నీ మహానాడుని విజయవంతం చేసినట్లే మహానాడు ను కూడా మనకు చెప్పిన టార్గెట్ ప్రకారం రాజంపేట నియోజకవర్గం నుండి 30 వేల మందితో కడుపులో అడుగుపెట్టి చంద్రబాబు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుల సూచనలతో నాయకులు కార్యకర్తలు అండదండలతో అందరి సహకారంతో రాజంపేట ను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా, తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా తయారుచేసి, కష్టపడ్డ ప్రతి కార్యకర్త టిడిపి పార్టీలో ఉన్నందుకు గౌరవంగా మాట్లాడుకునేలా చర్యలు చేపడతామని అన్నారు. పార్టీ సీనియర్ నేత డాక్టర్ పారా సుబ్బానాయుడు మాట్లాడుతూ వైసీపీ నుంచి వచ్చేవారికి పార్టీలో పదవులు ఇవ్వద్దని భాషా హర్షద్వానాల మధ్య అన్నారు. పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొంది, తండ్రికి టీటీడీలో పాలకమండలి సభ్యులుగా పదవి పొందిన మేడ మల్లికార్జునరెడ్డి ఆ తర్వాత వైసీపీ వైసీపీలోకి వెళ్లిపోయారని మండిపడ్డారు. అనంతరం ఆయా మండలాల అధ్యక్షులు ప్రధాన సమస్యల పరిష్కారానికి మినీ మహానాడులో తీర్మానం చేశారు. రాజంపేట మండలంలో రైతులకు అండగా నిలిచేలా అన్నమయ్య ప్రాజెక్టు పూర్తి చేయాలని, రాజంపేటకు మెడికల్ కాలేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరబల్లి మండలానికి శిబ్యాల వద్ద నుంచి హంద్రీనీవా నీరు మళ్లించి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుండుపల్లె మండలానికి జేరికోన ప్రాజెక్టుకు కాలువలు నిర్మించి సాగునీరు ఇవ్వాలని కోరారు. రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం నాయకులకు కార్యకర్తలకు చమర్తి జగన్మోహన్ రాజు అండగా ఉంటారని, ఏ పని కావాలన్నా జగన్ రాజు దగ్గర చేయించుకోవాలని, రాజంపేటకు సంబంధించి అన్ని విషయాలలోనూ జగన్ రాజే కార్యకర్తలకు తోడునీడగా ఉంటారని రాజంపేట అబ్జర్వర్ బల్లి దుర్గ ప్రసాద్ తెలియజేశారు. మినీ మహానాడు ను భారీ విజయవంతం చేసిన నాయకులకు, పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. జగన్ రాజు నాయకత్వంలో రాజంపేట నుండి మహానాడుకు పెద్ద ఎత్తున హాజరై సత్తా చాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ఎద్దుల సుబ్బరాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, శరత్ కుమార్ రాజు, రాజంపేట, వీరబల్లె, సుండుపల్లె మండల అధ్యక్షులు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, భానుమూర్తి రాజు, మోహన్ రెడ్డి, గీతాంజలి రమణ, సిద్దోటం నందలూరు మండల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు మినీ మహానాడుకు ఎద్దుల బండి పై వేలాది మందితో కలిసి జగన్ మోహన్ రాజు వేదిక వద్దకు చేరుకున్నారు. మినీ మహానాడు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో సంతోషం వ్యక్తం అయింది.



ఎద్దుల బండి పై వస్తున్న జగన్మోహన్‌రాజు



మినీ మహానాడులో మాట్లాడుతున్న సీనియర్ నేత డాక్టర్ పారా సుబ్బా నాయుడు

## మహానాడు సభను విజయవంతం చేయండి

### పిలుపునిచ్చిన..ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



**కమలాపురం 22 ప్రభాతవార్త**

కమలాపురం నగర పంచాయతీలోని టిడిపి కార్యాలయంలో కడపలో జరిగే రాష్ట్ర మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కోరారు. గురువారం నియోజకవర్గ ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. ముందుగా ఒక్కో మండలంలోని పంచాయతీల వారీగా, నాయకులతో జన సమీకరణకు సంబంధించి వారు సమీక్షా సమీవేశం నిర్వహించారు. ఒక్కో పంచాయతీకి ఎంతమందిని తీసుకొస్తారు. ఎన్ని వాహనాల్లో వస్తారని నాయకులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత మేరకు ఎక్కువమందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఉత్సాహంగా చెప్పడంతో తండ్రీ కొడుకులు ఆనందించారు.. వారు మాట్లాడుతూ మనపై ఎంతో నమ్మకంతో అదిష్టానం మన నియోజకవర్గంలోని పబ్బాపురంలో ఈ నెల 29న మహానాడు సభను నిర్వహిస్తున్నారని, మన నియోజకవర్గం నుంచి 50వేల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. అయితే కనీ వినని రీతిలో జిల్లాలో మనమే ఎక్కువగా 60 నుంచి 70 వేల మంది తక్కువ కాకుండా వెళ్లి మన ప్రత్యేకతను చాటాలని విజ్ఞప్తి చేయడంతో అందుకు అందరూ సమ్మతించారు. ఆరు మండలాల కన్వీనర్లు రాఘవరెడ్డి, నాగేశ్వర్రెడ్డి, కృష్ణారెడ్డి, విజయభాస్కర్రెడ్డి, గంగిరెడ్డి, భాస్కర్రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రతో సత్తాచాటిన హిందూ బాంధవులు



ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

**మదనపల్లె మే 22 ప్రభాతవార్త**

హనుమాన్ శోభాయాత్రతో హిందూ బాంధవులు సత్తాచాటడం హర్షణీయమని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి పేర్కొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మదనపల్లి పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమపవిత్రమైన హనుమాన్ జయంతి రోజున శోభాయాత్ర నిర్వహించడం శుభసూచకమన్నారు. యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కాషాయ రిబ్బన్లు ధరించి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేయడం హైందవ శక్తికి నిదర్శనమన్నారు. శ్రీరాముడు చూపిన ధర్మమార్గాన్ని హిందువులందరూ పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. అపారమైన భక్తితో శ్రీరాముడి మనసు గెలిచిన ఆంజనేయుడి స్ఫూర్తితో హిందువులంతా భక్తిమార్గంలో పయనించాలన్నారు. యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, ఈ శోభాయాత్రతో మదనపల్లి పట్టణ పురవీధులు జైశ్రీరామ్ నినాదంతో మార్మోగాయని వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో తాను భాగస్వామిని కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల గ్రానైట్స్ అధినేత వరదారెడ్డి నారద రెడ్డి, టి.కృష్ణప్ప నాయుడు, కాపు సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయ ప్రసాద్, పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభ యాత్ర



**పులివెందుల, మే22, ప్రభాత వార్త:**

హనుమజ్జయంతి సందర్భంగా పులివెందుల పట్టణంలో హనుమాన్ శోభ యాత్ర వైభవంగా నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో అంజన్న దేవాలయాలు అన్ని మారు మ్రోగిపోయాయి. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా హనుమాన్ దేవాలయాలలో అంజన్న మూల విరాట్ లను ఆయా దేవస్థానాల్లో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మధ్యాహ్నం దేవస్థానాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ప్రసాదం పొందారు. గురువారం సాయంత్రం హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున కాషాయం జెండాలను పట్టుకుని సుదిటిన తిలకం దిద్దుకుని జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. సాయంత్రం హిందు భక్తులందరూ కలిసి స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని పీడబ్ల్యు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ట్రాక్టర్లో ఉంచి శోభ యాత్ర నిర్వహించారు. ఈ శోభయాత్ర ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న పీడబ్ల్యుబీ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి గాంధీ సర్కిల్, కచేరి రోడ్డు, మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా కొత్త ఆర్టీసీ బస్టాండు వరకు బైకు ర్యాలీ, డీజే సౌండ్లతో శ్రీరాముడు, హనుమంతుని భక్తి పాటలతో చిందులేసుకుంటూ ముందుకు సాగుతూ భక్తిని చాటుకున్నారు. అలాగే పాత సంత మార్కెట్ లోని అంజన్న దేవస్థానం వద్ద నుంచి కూడా శోభా యాత్ర జరిగింది. హనుమాన్ శోభాయాత్ర లో పాల్గొనడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఈ ర్యాలీలో వివిధ పార్టీ నేతలు ,వివిధ సంఘ నాయకులు, భక్తులు, యువత, మహిళలు, చిన్నారులు ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, హిందూ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మహానాడు వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లు



**కడప మే 22: ప్రభాతవార్త:**

ఈ నెల 27, 28, 29 తేదీలలో సి.కె దిన్నె పరిధిలోని పబ్బాపురంలో జరగనున్న మహానాడు నేపథ్యంలో ఐ.జి.పి(ఆపరేషన్స్) సి.హెచ్.శ్రీకాంత్ ఐ.పి.ఎస్, కర్నూలు రేంజ్ డిఐజి డా. కోయ ప్రవీణ్ గురువారం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ఫుడ్‌కోర్టల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై కడప జిల్లా ఎస్పి ఇ.జి అశోక్ కుమార్, అన్నమయ్య జిల్లా ఎస్.పి వి.విద్యాసాగర్ నాయుడు, నంద్యాల జిల్లా ఎస్.పి శ్రీ అధిరాజ్ సింగ్ రాణా, అనంతపురం జిల్లా ఎస్.పి పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్.పి రాహుల్ మీనా ఇతర పోలీస్ అధికారులకు ఐ.జి.పి(ఆపరేషన్స్) సి.హెచ్.శ్రీకాంత్, దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు వారు సూచించారు. మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా, ఇతర జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

### కోటి విలువ చేసే బంగారు నగదు స్వాధీనం ఇప్పటికే 150 కేసుల్లో జైలు మరలా 17 చోరీలు

**రాజంపేట అర్బన్, మే22, ప్రభాత వార్త:**

దొంగతనాలకు పగులు లేదు... రాత్రి లేదు... ఇంటికి తాళాలు వేశారా దోచుకోవడమే.. వారి పని. ఈ విధంగా ఇప్పటికీ 150 కేసుల్లో దొరికి, జైలు శిక్ష అనుభవించినా వారికి తృప్తి తీరలేదు. జైలు నుంచి విడుదలై మరల దొంగతనాలకు అలవాటు పడ్డారు. రాజంపేట లోనే 6 చోట్ల దొంగతనాలు చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాకు వెల్లించిన వివరాలు మేరకు తాళం వేసిన ఇల్లే టార్గెట్గా చేసుకొని దోపిడీలకు పాల్పడే దొంగలు ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో 150 పైగా దొంగతనాలు చేసిన ఈ ముఠాను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు గురువారం అదుపులోకి తీసుకొని హాజరు పరిచినట్లు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎర్రగడ్డ కాలనీ నివాసముంటున్న తోట శివ కుమార్, అలియాస్ శివ భవాని, చిత్తూరు జిల్లా మోరవారిపల్లెకు చెంది నజెట్టి సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, రైల్వే కోడూరు మండలం మాధవరం పోడుకు చెందినసూరేపల్లి వెంకటేష్ అలియాస్ వెంకిలను రాజంపేట మండలం ఊట్కూరు సమీపంలోని సంజీవరాయ స్వామి ఆలయం వద్ద అరెస్ట్ చేసినట్టు తెలిపారు. స్నేహితుల నుంచి రికవరీ చేసిన చోరి సొత్తు మొత్తం విలువ సుమారు రూ.1 కోటి రూపాయలు. ఇంకా మిగతా బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీ వద్ద, ఇతర వ్యక్తుల వద్ద రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు. సుమారు కోటి రూపాయలు విలువ చేసే 961 గ్రాములు బంగారు ఆభరణాలు, 3 కేజీలు వెండి వస్తువులు, 1 లక్షా 40 వేల రూపాయల నగదు, 2 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.





# సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ

లక్కిరెడ్డిపల్లి : మే 22 ప్రభాతవార్త

ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం దేశానికి గర్వకారణమని ఇటీవల భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధం ఆపరేషన్ సింధూర్‌లో ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా కు చెందిన దేశ జవాన్ మురళీ నాయక్ మృతికి సంఘీభావంగా మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా తిరంగ ర్యాలీని నిర్వహించారు. మండలంలోని కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ ఎనలేని దేశభక్తిని చాటుతూ ఉగ్రవాధ కాల్పుల్లో మృతి చెందిన జవాన్ మురళి నాయక్ మృతికి సంఘీభావంగా ఉగ్రదాడిలో అమరులైన భారత జవాన్లను స్మరించుకుంటూ మురళి నాయక్ అమర హై, భారత్ మాతాకీ జై అంటూ జాతీయ జెండాలతో స్థానిక తహసీల్దార్ ఆఫీస్ నుండి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నియోజక వర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పాల్గొని జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మూడు రోడ్లకూడలి వద్ద జవాన్ మురళి నాయక్ కి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయకుడు యనమల మదన్మోహన్, మాజీ జెడ్పిటిసి రెడ్డియ్య యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు వెంకట్రామ రాజు , రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం డి షఫీ నాయక్, షేక్ ఆరీఫ్, సయ్యద్ మసూద్, ముక్తార అహ్మద్, కూటమి నాయకులు, మండల అధికారులు, అంగన్వాడి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## 12 వ మహాభారత యజ్ఞం ప్రారంభం

చిన్నమండెం మే 22 ప్రభాతవార్త:



మండలంలోని మల్లూరు గ్రామం మాండవ్య నది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ దేవాలయం వద్ద గురువారం 12వ పంచమ వేద మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. అందులో భాగంగా పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. వ్యాస జననం హరికథను భావతారని జియస్‌కె సీతాలక్ష్మి హరికథ ద్వారా వివరించారు. జూన్ 5 వ తేదీన దుర్యోధన వధ కార్యక్రమంతో మహాయజ్ఞం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు హరికథ,రాత్రి పూట నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.కావున ప్రజలు పెద్దయెత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక పై ర్యాలీ

చిన్నమండెం మే 22 ప్రభాతవార్త:



మండలంలోని మల్లూరు గ్రామ సంఘం లో గురువారం గ్రామస్థాయిలో గ్రామసభను ఏర్పాటు చేసి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ గంగిరెడ్డి గారి పల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఏపిసిన్ఫ్ ఆదర్శ రైతుల విజయగాథలను రైతులకు వివరించారు. ఆదర్శ రైతులు డి. వెంకట లక్ష్మమ్మ, అంజనమ్మ వారికి సన్మానాలు చేయడం జరిగింది, పిఎండిఎస్ వలన లాభాలు, ప్రయోజనాలు, మోడల్స్ గురించి, కిచెన్ గార్డెన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై. చలపతి నాయుడు, అరుణ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో RSK ఇంచార్జ్ తన్మయి, ICRP"s డి. రామాంజులు, కిరున, టి. రఘు, వెంకట్రామిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ఫిజియో థెరపీతో ఆరోగ్య సమస్యలు దూరం

తంబళ్లపల్లె మే 22 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఫిజియో థెరపీతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఫిజియో థెరపీ డాక్టర్లు సంతోష్ కుమార్, రమేష్ లు కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఫిజియోథెరపీ ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఫిజియోథెరపీ కి సంబంధించిన పలు సమస్యలు, పరిష్కారానికి తీసుకోవలసిన జాగ్రత్తలను కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి, ఎంపీడీవో ఉపేందర్ రెడ్డిలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో యోగ పై ప్రతి ఒక్కరికి సచివాలయ సిబ్బంది అవగాహనతో పాటు వారి పేర్లను అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో థామస్ రాజా, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ దరిద్దాం... ప్రాణాన్ని రక్షించుకుందాం...

లక్కిరెడ్డిపల్లి : మే 22 ప్రభాత వార్త



ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను ధరించి ప్రాణాన్ని రక్షించుకోవాలని లక్కిరెడ్డిపల్లి ఎస్సై రవీంద్ర బాబు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు యాక్సిడెంట్ గురవుతారు. అయితే యాక్సిడెంట్ కు గురైనప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలామందికి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ను కచ్చితంగా దయించాలని ఒకవేళ వాహనం నడిపేటపుడు మొదటి సారి హెల్మెట్ ధరించకుండా నడిపినట్లయితే వారిపైన చట్ట ప్రకారం అపరాధ రుసుము వేయడం జరుగుతుందని, రెండవ సారి కూడా హెల్మెట్ లేకుండా నడిపితే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి వాహనాన్ని నడపాలని ఎస్.ఐ. రవీంద్ర బాబు తెలిపారు.

## ఘనంగా హనుమజ్జయంతి

వేంపల్లి: మే 22: (ప్రభాత వార్త)

హనుమజ్జయంతిని గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి దంపతులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి మాట్లాడుతూ హనుమజ్జయంతి హిందువులకు అతి పవిత్రమైన, ముఖ్యమైన పండుగ అన్నారుఅతి ప్రాచీన కాలం లో వైశాఖ మాసం, బహుళ దశమి నాడు,పూర్వ భాద్రా నక్షత్రం లో తిరుమల ఏడు కొండల్లో ఒకటైన అంజనాద్రి కొండమీద వాయుదేవుని వరప్రసాదం తో అంజనా దేవి,కేసరి అనబడు వానర పుణ్య దంపతులకు హనుమంతుడు జన్మించాడని పరాశర సంహిత,శివ మహాపురాణం చెబుతున్నాయి. హనుమంతుడిని ఆంజనేయుడని,అంజనీ పుత్రుడని, వాయుసుతుడని, పవన కుమారుడని కూడా పిలుస్తారు. ప్రసన్నాంజనేయుడుగా, వీరాంజనేయుడుగా, అభయాంజనేయుడుగా, పంచ ముఖ ఆంజనేయుడుగా వివిధ రూపాలలో దర్శనమిస్తాడు. హనుమంతుడు కార్య సాధకుడు,కార్య దక్షుడు,కార్య శూరుడు. అచంచల భక్తి, విశ్వాసాలకు మారుపేరు. అతులిత బలశాలి.సాహస వంతుడు.మహా పండితుడు, బుద్ధిశాలి.సమయ స్ఫూర్తికి ప్రతిరూపం.హనుమంతుడు లేకపోతే రామాయణ మే లేదని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి శ్రీమతి నరెడ్డి అలిమేలమ్మ,పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, రామాంజనేయ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్. సుబ్రమణ్యం, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, రమణ, నాగరాజు, వినయ్, అశ్విత్,సాయి పాల్గొన్నారు.



## దివ్యాంగ చిన్నారుల కొరకు సర్వే

వేంపల్లి: మే 22: (ప్రభాత వార్త)



సమగ్ర శిక్ష ,కడప జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మండల విద్యా శాఖ అధికారులు ఆదేశాలతో ఈ నెల మే 13వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్నట్లు డిస్టిక్ ఎం ఐ ఎస్ మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ పి. లక్ష్మీనంసింహరాజు తెలియజేశారు. వేంపల్లి మండలంలో దివ్యాంగుల సర్వే ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఈఆర్పి లు యశోద, సుజాత లు మండలంలో 18 సంవత్సరాలలోపు దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో ఇంకా నమోదు కాని వారు, బడి బయట ఉన్న చిన్నారులు, ఐదు సంవత్సరముల లోపు దివ్యాంగ చిన్నారులు కొరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వేంపల్లి మండలంలో ఎనిమిది మంది కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని భవిత కేంద్రాలలో దివ్యాంగుల నమోదు శాతాన్ని పెంచాలని లక్ష్మీ నరసింహరాజు తెలియజేశారు. ఇంకా మండలంలో ఎవరైనా దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో నమోదు కాని వాళ్ళు ఉంటే వాళ్ళు భవిత కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం ద్వారా వీరికి కావలసినటువంటి అలవెన్స్ లు, ఆపరేషన్లు, ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పి లు యశోద, సుజాత, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గర్భిణీలు వైద్యుల సూచనలు పాటించాలి

ముద్దనూరు, మే 21, ప్రభాతవార్త:



గర్భిణీలు వైద్యాధికారుల సూచనలు తప్పక పాటించాలని వైద్యాధికారుల పర్యవేక్షణ లో పిస్తే గర్భధారణ సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని వైద్య అధికారి నాగార్జున తెలిపారు. గురువారం ప్రపంచ ఎక్కలామీసియా దినోత్సవ సందర్భంగా ముద్దనూరు పట్టణంలోని వైద్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గర్భ కాలంలో కడుపు లోనొప్పి వాంతులు, విరేచనాలు, తలనొప్పి, కండ్లు తిరగడం,అధికరక్తపోటు, అస్పష్ట మైన దృష్టి గర్భ ధారణ సమయం లో సంభవిస్తాయని మరియు మూత్రములో ప్రోటీన్స్ ఉండడం జరుగుతుంది అని, శరీరవాపు వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రామారావు, వైద్య సిబ్బంది ఇందిరమ్మ, ముస్కిన్ బి, ఆశా కార్యకర్తలు నీలవేణి, చంద్రబాయ్, గర్భిణీలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న టిడిపి యువనాయకుడు కానాల

బ్రహ్మంగారిమఠం మే 22 ప్రభాతవార్త:



బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లి పంచాయతీ ఎద్దులాయపల్లి గ్రామానికి చెందినటువంటి పెగడ వెంకటేశ్వర్లు పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉండడంతో పూర్తిగా నడవలేని పరిస్థితి తన తల్లి కూడా పూర్తిగా మంచానికి పరిమితం కావడంతో కుటుంబ పోషణ భారం అయింది, దాతలు ఎవరైనా తమను ఆదుకోవాలని సోషల్ మీడియా ద్వారా తెలియజేయడంతో, స్పందించిన టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు 5000 రూపాయల ఆర్థిక సాయం, ఒక నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా తమను ఆర్థికంగా ఆదుకున్న బ్రహ్మంగారిమఠం మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డికి పెగడ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,చెన్నుపల్లి జయరామిరెడ్డి, గుజ్జు రామాంజనేయులు, పుటాల శివ యాదవ్,తదితరులు పాల్గొనడం జరిగింది.

## బ్రహ్మంగారి సన్నిధిలో మెదక్ జిల్లా భక్తులు

బ్రహ్మంగారిమఠం మే 22 ప్రభాతవార్త:



జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వా మి సన్నిధిలో మెదక్ జిల్లా బ్రహ్మంగారి భక్తులు స్థానిక పుర వీధుల్లో జై వీర బ్రహ్మ జై గోవిందా మాంబా జై అంటూ బ్రహ్మంగారినామ సంకీర్తనలతో భజనలు చేసుకుంటూ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ లో 75 సంవత్సరాల మునుపునిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి దేవస్థానం నిర్మించమని, దానిలో భాగంగా 75 వ బ్రహ్మంగారి ఉత్సవాలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చామని వారు తెలిపారు.

## ముగ్గురు మట్కా నిర్వాహకులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం, మే 22, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణం సాయికుటీర్ రోడ్డు నందు ముగ్గురు వ్యక్తులు మట్కా నిర్వహిస్తుండడంతో వారిని అరెస్టు చేసినట్లు 3వ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. హనుమంత్ తెలిపారు. 3వ పట్టణ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డికి రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి పోట్లదుర్తికి చెందిన విశ్వనాథరెడ్డి, ప్రొద్దుటూరు ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన నరసింహులు, దేవాంగపేటకు చెందిన వీరయ్యలు మట్కా నిర్వహిస్తుండడంతో వారి వద్ద నుంచి రూ.95వేలు నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తడి చెత్త పొడి చెత్త ఇంటి దగ్గరే చేసి ఇవ్వాలి

సుండుపల్లి, మే 22, ప్రభాతవార్త:



మండల మండల పరిధిలోని బాగంపల్లి, మడితాడు, పెద్దినేని కాలువ, ఈడికిపల్లి ఈ గ్రామాలను డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మరియు సుండుపల్లి స్పెషల్ ఆఫీసర్ సురేష్ పై గ్రామాలను సందర్శించి అక్కడ చెత్త సేకరణ గురించి తడి చెత్త పొడి చెత్త ఇంటిదగ్గరే వీరు చేసి ఇవ్వాలని గ్రామస్తులకు తెలియజేశారు. మరియు ఎస్ డబ్ల్యు పిసి లను సందర్శించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హెచ్ సురేష్ బాబు పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్, ఆనంద్, శ్రీనాథరెడ్డి, పాల్గుణ, వంశీ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభం

పీలేరు మే 22 ప్రభాతవార్త:



పీలేరు పట్టణంలోని ఆర్.టి.సి బస్టాండ్ ఆవరణలో మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ సమీపం లోని ఖాళీ స్థలంలో గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ భాగవతారిణి, గానప్రవీణ ఇ. జ్యోత్స్న ఆలకించిన సర్పయాగం హరికథా కాలక్షేపంతో మహాభారతయజ్ఞ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. పగటిపూట హరికథా కాలక్షేపం గురువారం 22 నుండి జూన్ 8 వరకు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఈనెల 24 నుంచి ప్రతి రోజు రాత్రి 9 గంటలకు శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి బృందం చే నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. ఆర్టీసీ, విద్యుత్ శాఖ, పోలీసు వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని పీలేరు గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. హరికథా కాలక్షేపానికి పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, టిడిపి మహిళా నాయకురాలు రమాదేవి తదితరులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్, మే 22 ప్రభాతవార్త :



ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని కామనూరు రోడ్డులోని మంజునాథ కాలనీ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామికి హనుమత్ జన్మదినోత్సవం పురస్కరించుకొని భక్తులు గురువారం పూజలు అభిషేకాలు అర్చన వడమాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థలదాత నీలాపురం సుబ్బారెడ్డి, విగ్రహ దాత గంగిరెడ్డి పాలసుబ్బారెడ్డి, ఆలయ చైర్మన్ పాలగిరి లక్ష్మిరెడ్డి, సోమలూరు చిన్న పెద్దయ్య, దశమంద బ్రదర్స్, శివశక్తి పుల్లారెడ్డి, గో సేవకుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలో సిద్దేశ్వరం జయప్రదం చేయండి

చాపాడు. మే 22. ప్రభాతవార్త..



సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన తొమ్మిదవ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 31న సంగమేశ్వరం దగ్గర జరిగే ప్రజా బహిరంగ సభ జయప్రదం చేయాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏ.వి. రమణ పిలుపునిచ్చారు. గురువారం చాపాడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీ అంటే అమరావతి పోలవరమే కాదు.. అందరి ఆంధ్రప్రదేశ్ అని గుర్తించే లాగా రాయలసీమ ప్రగతి చేపట్టేలా పాలకొల్లు పై ఒత్తిడి తేవాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధనకు ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి మైదుకూరు నియోజకవర్గం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చాపాడు సమితి నాయకులు గోపాల్,వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, మే 22, ప్రభాతవార్త :



రాయలసీమ సాగు నీటి పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ ఎస్పీ మహమూద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఈనెల 31న ఉదయం 11 గంటలకు సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంగమేశ్వరం వద్ద జరిగే భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం తెలుగు ప్రాజెక్టు వలన రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ అలుగు వల్ల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చున్నారు. తక్కువ ఖర్చుతోనే అలుగు నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. సిద్ధేశ్వరం అలుగు రాయలసీమ రైతులకు సంబంధించి ఆకాంక్ష అని, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సిద్ధేశ్వరం అలుగు సాధన కోసం ఈనెల 31న జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. డాక్టర్ వరుణ్కుమార్రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ముందుకు సాగకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి తెలుగు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శోభాయాత్ర

పోరుమామిళ్ల రూరల్, మే 22ప్రభాతవార్త:



శ్రీ హనుమత్ జయంతి సందర్భంగా మల్లకత్తువ వద్ద వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ వారి ఆధ్వర్యంలో గురువారం కాషాయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు తలపాగాలు ధరించి, బైకులు నడపడం, శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ విరజానంద స్వాముల వారు స్వయంగా ఈ బైక్ ర్యాలీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ అనంతరం దేవాలయంలో శ్రీ విరజానంద స్వామి ఆధ్యాత్మిక, సామాజిక విషయాలను భక్తులకు వివరించారు.. హిందుత్వ కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి పట్టణములోని అన్ని వీధులకు సంబంధించిన వ్యక్తులు సహాయ సహకారాలు అందించి ,ఈ దేవాలయాన్ని శక్తి కేంద్రంగా మార్చాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్, ఎస్ ఎస్ ఎఫ్, జనహిత, బిజెపి, జనసేన, టిడిపి, వైయస్సార్సీపి కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బండలాగు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



కమలాపురం మే 22 ప్రభాతవార్త

హనుమాన్ జయంతి సందర్భంగా కమలాపురం నియోజకవర్గం వల్లూరు మండలం కోటూరు గ్రామం సమీపంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నందు కమలాపురం శాసనసభ్యుడు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి గోటు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు విచ్చేశారు. అనంతరం ఆలయ పూజారి శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన ఎద్దుల బండ్ల పోటీలను కమలాపురం శాసనసభ్యుడు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి వారికి ఉదయమే ఆకు పూజ నిర్వహించి ప్రత్యేక అలంకరణలో చేశారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి. స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో వల్లూరు మండల అధ్యక్షుడు లేవాక నాగేశ్వర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అభయ ఆంజనేయస్వామి కళ్యాణ మహోత్సవం

పోరుమామిళ్ల రూరల్, మే 22 ప్రభాతవార్త:



బి.కోడూరు మండలం పెద్దుల్లపల్లె గ్రామపంచాయతీ కొండంపల్లె గ్రామ సమీపమున గురువారం శ్రీ సువర్చలాదేవి సమేత అభయ ఆంజనేయ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం చాలా వైభవంగా జరిగింది. దేవస్థానము పెద్దలు శ్రీ జయరామి రెడ్డి (కొండమీద స్వామి) ఆహ్వానం మేరకు బద్వేల్ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి , బి.కోడూరు మండల నాయకులు బసిరెడ్డి దుగ్గిరెడ్డి , ఇతర ముఖ్య నాయకులు హాజరై దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## అంజన్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి

పులివెందుల,మే22, ప్రభాత వార్త:



హనుమాన్ జయంతి పురస్కరించుకుని పులివెందులలోని పలు ఆంజనేయ స్వామి గుడి కమిటీ ఆహ్వానం మేరకు పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి మరియు వైఎస్ మనోహర్ రెడ్డి మొదట స్థానిక పాత మార్కెట్ సమీపంలో ఉన్న పడమర ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్థానిక పిడబ్లుడి కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలంతా సంతోషంగా ఉండాలని స్వామి వారిని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, మండల నాయకులు వేల్పుల రాము, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమోళి, కౌన్సిలర్ లు విజయ్ నాయుడు, కో ఆప్షన్ మెంబర్ చంద్రమోళి, టెంపుల్ చైర్మెన్ సుధీకర్ రెడ్డి, బాటరీ ప్రసాద్, కమిటీ నిర్వాహకులు చలమా రెడ్డి , దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో వైభవంగా హనుమజ్జయంతి

రాజంపేట అర్బన్, మే22 ప్రభాతవార్త



పవనసుతుడు,అంజనేపుత్రుడు, హనుమంతుని జయంతి వేడుకలు గురువారం రాజంపేటలో అంగరంగ వైభవంగా జరిగాయి. తాళిక ప్రధాని రహదారిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే వైబియన్ పల్లెలోని ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజామున హనుమాన్ చాలీసా, ఆంజనేయ స్వామి అష్టోత్తర శతనామాలతో, మహిళల జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. రెండుఆలయాలలో ఆకు పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అలాగే కుచ్చివారిపల్లి నుండి రామాలయంలో హనుమంతుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టణ పరిధిలో హనుమాన్ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆలయాల్లో హనుమంతుడికి వడమాలతో అలంకరించారు. ఆలయ పూజారులు రవి స్వామి ,హరి స్వామి,అప్పలాచారి శేషాద్రి స్వామి, జేవీఎం గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజల నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది.

## కనుల విందుగా హనుమాన్ జయంతి వేడుకలు.

చిట్వేలి, మే 22, ప్రభాతవార్త:



హనుమాన్ జయంతి వేడుకలు చిట్వేలి మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో కనుల విందుగా నిర్వహించారు. గురువారం హనుమాన్ దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పూలమాలతో పాటు వడమాల, తమలపాకుతో కూడిన మాలలను స్వామి వారికి అర్పించారు. రాజుకుంట క్రాస్ శ్రీశ్రీశ్రీ సంజీవరాయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ధర్మకర్త రామచంద్రయ్య స్వామి, తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డు శ్రీశ్రీ దత్తగిరి నారాయణ తపోవనం వద్ద ధర్మకర్త నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అన్నదానాలు హరే రామ భజన లు, చెక్కభజనలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు జయంతి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## వెల్లాలలో హనుమాన్ జయంతి ఉత్సవం

రాజుపాళెం,మే22,ప్రభాతవార్త.



మండల పరిధిలోని వెల్లాలపుణ్యక్షేత్రంలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవం సందర్భంగా శ్రీసంజీరాయ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితులు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీసంజీవరాయస్వామి ఒంటే వాహనంపైన మాడవీధులలో ఊరేగింపు నిర్వహించారు.ఈకార్యక్రమంలో మాజీ చేర్మేన్ విజయ లక్ష్మీ, బలరామిరెడ్డి, సర్పంచ్ రాధా,రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో ముగ్గురు తొలగింపు

మదనపల్లి మే 22 ప్రభాతవార్త

మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో ఆర్థిక అరాచకాలకు పాల్పడిన నాగరాజు, పృథ్వీ రాజ్, ఓబులేసులను యూనియన్ బాధ్యతల నుంచి తొలగించినట్లు యూనియన్ గౌరవ అధ్యక్షులు సాంబశివ తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ లో ఇటీవల జరిగిన ఆర్థిక , అరాచకాలను విచారించిన అనంతరం, దానికి బాధ్యులైన వారిని యూనియన్ భాధ్యతల నుంచి తొలగాంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు , అన్నమయ్య జిల్లా ఇంఛార్జి రామచంద్రయ్య సూచన మేరకు తొలగించామని తెలిపారు యూనియన్ హక్కుల పరిరక్షణ, నైతిక విలువల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ కి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కు చెడ్డపేరు తెచ్చే విధంగా వీరు వ్యవహరించారని ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

## ఆంజనేయ స్వామి జన్మోత్సవం

పెనగలూరు మే 22 ప్రభాతవార్త



మండల కేంద్రంలో హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి జన్మోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాని కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు గణపతిరెడ్డి విజయ్ భాస్కర్‌రెడ్డి, సింగమాల హరికృష్ణ, పడుచూరి ప్రదీప్ కుమార్, ధనాసి హరినాథ్, కూకట్లపల్లి సంజీవయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నలవురెడ్డిపల్లి మెయిన్ రోడ్‌లోని సంజీవ రామస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా తెల్లవారుజామున నుంచి అభిషేకాలు అర్చనలు ఆలయ ధర్మకర్త పుత్తా వెంకట సుబ్బారెడ్డి జరిపించారు.

## ఆంజనేయస్వామిగుడిలో మంత్రి ప్రత్యేక పూజలు

చిన్నమండెం, మే 22 ప్రభాతవార్త :



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం చిన్నమండెం మండలం, దేవగుడిపల్లి గ్రామం, కొండమోల ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా మంత్రి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## శ్రీ అభయాంజనేయస్వామి గుడిని ప్రారంభించిన మంత్రి

చిన్నమండెం, మే 22 ప్రభాత వార్త :



మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం చిన్నమండెం మండలం, వండాడి గ్రామం, ఉప్పరపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి గుడిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం ఆలయ మండపంలో మంత్రికి ఆలయ అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి వర్యులు భక్తిశ్రద్ధలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపానికి చేరుకున్న ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి ముందు చిన్నమండెం మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుల్లతో మంత్రివర్యులకు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

చిన్నమండెం, మే 22 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు మంచి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మంత్రి తమ నివాసం నందు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతని చ్చి బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజలకు అధికారులపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

## నీటితో కళకళలాడుతున్న పింఛా ప్రాజెక్ట్

సుండుపల్లి, మే 22, ప్రభాతవార్త:

ముడంపాడు గ్రామంలోని కించ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పింఛా ప్రాజెక్టుకు వరద నీరు స్వల్పంగా చేరుతుందని నీటిపారుదల శాఖ ఏ ఈ నాగేంద్ర నాయక్ తెలిపారు ప్రస్తుతం 989.20 అడుగులు నీరు ఉందని వర్షాలు మొదట్లోనే కురుస్తుండడంతో ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని ఈ ఏడాది రెండు పంటలు పుష్కలంగా తీయడానికి అవకాశం ఉంటుందన్నారు ప్రస్తుతానికి గురువారం 97 కిసక్కుల నీరు రావడం జరిగిందని ఇలా మెల్ల మెల్లగా రోజు కొంచెం కొంచెం నీరు వచ్చిన తొందరలో ప్రాజెక్టు నిండేందుకు ఆస్కారం ఉందని ఆయన తెలియజేశారు.

## వాస్తవాలు మాట్లాడాలి..

కడప కార్పొరేషన్, మే 22 ప్రభాతవార్త:



గత సార్వత్రిక ఎన్నికల్లో కడప అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని, సీనియర్ నాయకులు మని చెప్పుకుంటూ అవాస్తవాలు మాట్లాడటం, నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం కడపలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలో సీనియర్ నాయకుని అని చెప్పుకునే ఓ నేత ఏ రోజు పార్టీకి మంచి చేయలేదని, ప్రత్యేత్రి పార్టీతో లాలూచీపడి గత ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవి రెడ్డికి వ్యతిరేకంగా చేశారని ఆరోపించారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి ఇప్పుడు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో సీటు రాకపోయేసరికి వైఎస్ఆర్ సీపీకి ఓటు వేయమని, టిడిపి ఎమ్మెల్యేను ఓడించడానికి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులతో మాట్లాడిన ఆడియో వీడియో బయట పెడితే అది మార్ఫింగ్ చేశారని చెప్పడం సిగ్గుచేటన్నారు. సీనియర్ నాయకునని చెప్పుకునే వారి డివిజన్ లో టిడిపికి మెజార్టీ రాలేదన్నారు. చేసిన తప్పులు కప్పించుకోవడానికి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డిపై అవస్తవాలు మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. కడప ఎయిర్పోర్ట్‌లో కడప ఇన్చార్జి మాధవి రెడ్డికే టికెట్ ఇస్తున్నామని చంద్రబాబు నాయుడు ప్రకటించారని గుర్తు చేశారు. ఆమెకు వ్యతిరేకంగా పనిచేసింది నిజమా కాదా అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి. రాజా, చలపతి, చంద్రబాబు, శివారెడ్డి, బొమ్మిశెట్టి, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

# మదనపల్లి కేంద్రీయ విద్యాలయంకు పచ్చ జెండా

### ఈఏడాదే నుండే విద్యార్థుల ప్రవేశపక్రియ

మదనపల్లి మే 22 ప్రభాతవార్త



అనుమతులు అందజేస్తున్న కె.వి బృందం

అన్నమయ్య జిల్లా మదనపల్లి కేంద్రీయ విద్యాలయంకు కెవి బృందం పచ్చ జెండా ఊపింది. గురువారం కేంద్రీయ విద్యాలయంకు సంబంధించి కేంద్ర కార్యాలయ బృందం మదనపల్లి ను సందర్శించారు. డిప్యూటీ కమిషనర్ మంజునాథ్,అసిస్టెంట్ కమిషనర్ అనురాధ నేతృత్వంలోని బృందం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తాసిల్దారు ధనంజనేయులు జిల్లా అధికారులను కలిశారు. తొలుత సబ్ కలెక్టర్ స్థానిక గిరిజన నివాస పాఠశాల భవనంలో ఈ విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు కేంద్రీయ విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించడానికి అవసరమైన అన్ని అనుమతులను అందజేశారు. 2025,26 విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను త్వరలో పేపర్ ప్రచురణ ద్వారా తెలియజేస్తామని కేవీ బృందం ధృవీకరించారు. తరువాత శాశ్వత పాఠశాల భవన నిర్మాణ కోసం వలసపల్లి గ్రామం వద్ద మదనపల్లిపుంగనూరు రహదారి పై ఉన్న నవోదయ పాఠశాల ఎదురుగా ఉన్న 6.09 ఎకరాల భూమిని పరిశీలించి ఖరారు చేసారు. సబ్ కలెక్టర్, తహసీల్దార్ సమక్షంలో ఈ భూమిని కేంద్రీయ విద్యాలయకు ప్రభుత్వం అప్పగించారు. త్వరలో శాశ్వత భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తామని మంజునాథ్ వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్నత ప్రమాణాలతో పాటు ప్రాథమిక శిక్ష అందించడమే కాకుండా క్రీడలు, విలువలతో కూడిన విద్య బోదిస్తు దేశానికి మంచి పౌరులు అదిస్తామని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ విషయం పై మనకు 2022లో ప్రధాని నరేంద్ర మోడీ మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేశారన్నారు.

## దేవాలయాలను సందర్శించిన జయచంద్రారెడ్డి రెడ్డి

కురబలకోట, మే 22 ప్రభాతవార్త



తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం అంగళ్లు మరియు మదనపల్లి మార్గ మధ్యమున గౌని వారి పల్లి వద్ద నెలకొన్న శ్రీ సర్వమంగళ ఆంజనేయస్వామి దేవాలయమున హనుమాన్ జయంతి సదర్భంగా ఆలయమున పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన తంబళ్లపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డివారితో సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు పాటు భక్త మహాశ్రేయులు మరియు కూటమి నాయకులు వైజి సురేంద్ర యాదవ్, మార్కిరి. ఆంజనేయ రెడ్డి, దాదం లోకనాథరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కే నరసింహారెడ్డి, రమణప్ప, మాజీ సర్పంచ్‌లు మస్తాన్ రెడ్డి, ఆనంద రెడ్డి. తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి ఓటికొండ రెడ్డి శేఖర్, పూస మోహన్ రెడ్డి, తుమ్మచెట్ల పల్లి సూరి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానాడు కోసం భారీ ఏర్పాట్లు

సిద్ధవటం మే 22 ప్రభాతవార్త



మహానాడు కార్యక్రమాన్ని పురస్కరించుకుని కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ నాయకత్వాన్ని సమర్థిస్తూ ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డెప్ప గారి శ్రీనివాసుల రెడ్డి ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి పెంచలయ్య, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఘన విజయానంతరం జరుగుతున్న మొట్టమొదటి మహానాడు ఇది. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాగముని రెడ్డి మరియు పీవీ ప్రదీప్ కుమార్ నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని తెలియజేసారు.

## పదవులు పొందే అర్హత ప్రవీణ్‌కి లేదు

### టిడిపి నాయకులు పగిడాల దస్తగిరి, శివశంకర్

ప్రొద్దుటూరు మే 22 ప్రభాతవార్త



గత ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల పరిధిలో వైసిపి గెలుపుకు తెలుగుదేశం పార్టీ ఓటమికి కృషి చేసిన ఉక్కు ప్రవీణ్ కుమార్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ పదవులు పొందే అర్హత లేదని టిడిపి నాయకులు పగిడాల దస్తగిరి రిటైర్డ్ ఎస్సై శివశంకర్ అభిప్రాయపడ్డారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కడపలో నిర్వహిస్తున్న మహానాడు నిర్వహణ కమిటీలలో ప్రవీణ్ రెడ్డికి స్థానం కల్పించడం తెలుగుదేశం పార్టీ నిజమైన కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో ప్రొద్దుటూరు కమలాపురం బద్వేలు నియోజకవర్గాల పరిధిలో తనకు ప్రొద్దుటూరు టికెట్ ప్రకటించలేదన్న చాకుతో వైసిపి విజయం కోసం కృషి చేసి తెలుగుదేశం పార్టీ నాశనం కోరుకున్నారని తెలిపారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ అధికారంలో చేపట్టాక ప్రతిపక్ష వైసిపి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి టీడీపీ పై స్థానిక ఎమ్మెల్యే వరద పై విమర్శలు గుప్పించినా ఆ విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం ప్రవీణ్ ఏనాడైనా చేశారా అని ప్రశ్నించారు. అలాంటి వారికి టిడిపి అధిష్టానం మహానాడు నిర్వహణ కమిటీలలో స్థానం కల్పించడం సరికాదన్నారు. తక్షణమే టిడిపి అధిష్టానం మరియు జిల్లా నాయకులు పునః పరిశీలించి నిర్వహణ కమిటీల నుండి తొలగించి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

## బదిలీల సహకార కేంద్రం ఏర్పాటు

ఎడ్యుకేషన్ మే 22 ప్రభాతవార్త:

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కడప యుటిఎఫ్ భవన్ నందు సహకార కేంద్రం ఏర్పాటు చేసినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకుని వచ్చి మొదటిసారిగా బదిలీలు జరుపుతున్నదని, బదిలీలకు సంబంధించిన ఏవైనా సమస్యల పరిష్కారానికి మరియు ఆన్లైన్లో అప్లికేషన్ సబ్మిట్ చేయుటకు, బదిలీల ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. బదిలీలకు అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఇబ్బందులకు గురికాకుండా వారికి మార్గదర్శకత్వం అందించే విధంగా బదిలీల ప్రక్రియ ముగిసే వరకు యుటిఎఫ్ భవన్లో సహకార కేంద్రాన్ని నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బదిలీలలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించగలరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్,ప్రకాష్ బాబు, విజయచంద్రా రెడ్డి, గంగన్న, మహబూబ్ బాషా,శివప్రసాద్, ప్రభాకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా అన్నప్రసాదం

ప్రొద్దుటూరు మే 22 ప్రభాతవార్త

పట్టణం బుద్దాయి పల్లె లోని హనుమాన్ దేవాలయ సమీపంలో హనుమాన్ జయంతి సందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పో రెడ్డి నరసింహారెడ్డి మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా లడ్డు ప్రసాదంతో పాటు అన్న ప్రసాదము భక్తులకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ రెడ్డి, లింగారెడ్డి, చెన్నారెడ్డి, మరియు భక్తులు బుద్దాయి పల్లె గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తంబళ్లపల్లె డంపింగ్ యార్డ్ ఆదర్శవంతం

తంబళ్లపల్లె మే 22 ప్రభాతవార్త ః



నియోజకవర్గ కేంద్రంలోని డంపింగ్ యార్డ్(చెత్త సేకరణ కేంద్రం) ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని తంబళ్లపల్లె నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డితో కలిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి అందులో వర్మీ కంపోస్ట్ విధానం, మొక్కల పెంపకం, తడి, పొడి చెత్త విభజన నిర్వహణపై ఎంపీడీవోతో పాటు కార్యదర్శి రామకృష్ణ గ్రీన్ అంబాసిడర్లను ప్రశంసించారు. ప్రతి డంపింగ్ యార్డ్ తంబళ్లపల్లె యార్డును ఆదర్శంగా తీసుకొని ఎరువు తయారీ తోపాటు పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం తంబళ్లపల్లె పురవీధుల్లో ఇంటింటికి తిరిగి పారిశుధ్యం నిర్వహణ, చెత్త సేకరణ పై ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని ప్రతి కార్యదర్శి చెత్త నుండి ఎరువు తయారీ పై దృష్టి సారించి గ్రామాలలోని తడి పొడి చెత్త సేకరణ పై గ్రీన్ అంబాసిడర్లు సహకరించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి రామకృష్ణ, జనసేన మండల నాయకుడు ఎద్దుల నరసింహులు, భాస్కర, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## 15వ తేదీ వరకు సరుకుల పంపిణీ

తంబళ్లపల్లె మే 22 ప్రభాతవార్త ః



ప్రభుత్వం నిత్యవసర సరుకులు ఇంటింటా పంపిణీ చేసే వాహనాలు రద్దు చేసిందని కాన ప్రజలకు ఇబ్బంది లేకుండా వచ్చే నెల నుండి స్టోర్ డీలర్లు నిత్యావసర సరుకులు ప్రతినెల 15వ తేదీ వరకు అందుబాటులో ఉండి కచ్చితంగా పంపిణీ చేయాలని తాసిల్దార్ హరికుమార్ ఆదేశించారు. గురువారం స్టోర్ డీలర్లతో తాసిల్దార్ సమీక్ష జరిపి నిత్యవసర సరుకుల పంపిణీలో సకాలంలో డీడీలు చెల్లించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. నిత్యవసర సరుకులు తూకాలలో వ్యత్యాసం లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఈ సమీక్షలో డిటి భువనేశ్వరి, మండలంలోని స్టోర్ డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో స్టేట్ మొదటి స్థానంలో పెద్దమండెం

పెద్దమండెం మే 22 ప్రభాతవార్త



పెద్దమండెం మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో పెద్దమండెం తాసిల్దార్ సయ్యద్ అహమ్మద్ రాష్ట్రంలో నే మొదటి స్థానంలో నిలిచారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రరెవిన్యూ ప్రజాభిప్రాయ సేకరణలో ఐదవ రేటింగ్ కు 4.6 రేటింగ్ సాధించిన పెద్దమండెం తాసిల్దార్ సయ్యద్ అహ్మద్‌కు మండల అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు అభినందనలు తెలిపారు మహానుభావులు కోటికి ఒక్కరు అంటారు అలాంటిది వంద మందిలో ఒక్కరుగా నిలిచారు అని కొనియాడారు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను అరికట్టారు భూ కబ్జాలను నివారించారు డీకేటి ని స్వాధీనం చేసుకున్నారు తారుమారు చేసిన పట్టాలను సవరించారు నెలలో చేయాల్సిన పనులను వారములు చేసి చూపించారు వారంలో చేయాల్సిన పనులను మూడు రోజుల్లో పరిష్కరించారు మూడు రోజుల్లో పరిష్కరించాల్సిన పనులను మొదటి రోజే పరిష్కరించి ప్రజల చేత మంచి తాసిల్దారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలాంటి తహసీల్ధారును గత 15 సంవత్సరాలుగా ఈ మండలంలో మేము చూడలేదని ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులు అనధికారులు చెప్పుకొచ్చారు. ఎలాంటి రికమండేషన్లు లేకుండా స్వయంగా వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రతి సమస్యను తమ సిబ్బందితో వారి ఇంటి వద్దకు పొలం వద్దకు వెళ్లి పరిష్కరించిన మహానుభావులు అని రైతులు బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు సకాలంలో సమస్యలు పరిష్కరిస్తున్నారని సంతోషాన్ని మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

### దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవస్థానములో 12వ వార్షికోత్సవం

సిద్దవటం మే 22 ప్రభాతవార్త ః



మండలంలోని కనుములోపల్లి వద్ద వెలసిన శ్రీశ్రీ దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవస్థానములో 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీ ఆంజనేయస్వామి జన్మోత్సవము, వార్షికోత్సవ సందర్భంగా కనుమలోపల్లి దగ్గర శ్రీశ్రీ దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవస్థానము నందు పూజా కార్యక్రమములు నిర్వహించడం జరిగిందన్నారు. భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఉపాధి పనులను ప్రారంభించిన డ్వామా పీడీ

కలికిరి, మే 22, ప్రభాతవార్త:



కలికిరి మండలం పత్తేగడ గ్రామ పంచాయతీ సీఆర్పీఎఫ్ మిలిటరీ క్యాంపస్ నందు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గౌరవ పథక సంచాలకులు అన్నమయ్య జిల్లా టి. వెంకటరత్నం గురువారం ఉదయం ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ మూడు ఎకరాల్లో 200 మొక్కలు అలాగే అకిరా మియావాకీ హైడెన్సిటీ ప్లాంటేషన్ కింద 0.25 ఎకరాలలో 2700 మొక్కలు నాటే విధంగా పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలికిరి క్లస్టర్ ఏపీడీఎన్ శ్రీనివాసులు, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ అమర్‌నాథ్ యాదవ్, కె.రవీంద్ర రాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ డీజీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి,

మైదుకూరు, మే 22, ప్రభాతవార్త:



పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నందు టూవీలర్ వాహనదారులకు ప్రమాదాలపై అర్బన్ సిఐ కె.రమణారెడ్డి పలువురికి అవగాహన కల్పించారు. అంతేకాకుండా వాహనదారులు రూల్స్ అతిక్రమించిన వారికి,మైనర్ విద్యార్థులు, వాహన సంబంధించిన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్, త్రిబుల్ రైడింగ్, వారు రూల్స్ అతిక్రమించిన వారికి ఫైన్‌లు వేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సెలవులు దృశ్య పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా రహదారిపై తోపుడు బండ్లు, వాహనాలు, షాపు నేమ్ బోర్డు, రహదారిపై ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదని అలాంటివి పెట్టినచో కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయండి

కలికిరి, మే 22, ప్రభాతవార్త:

కలికిరి సీఎల్ఆర్సీ భవనం నందు కలికిరి క్లస్టర్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో అన్నమయ్య జిల్లా గౌరవ పథక సంచాలకులు టి.వెంకటరత్నం పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కలికిరి క్లస్టర్ ఉపాధి హామీ సిబ్బంది అందరూ కూడా తమకు ఇచ్చిన లేబర్ టార్గెట్ ఈ 3 నెలల్లో సాధించాలని కోరారు. అలాగే ఫారం పాండ్ సంబంధించి ఇచ్చిన టార్గెట్‌ను మే మరియు జూన్ నెలలో పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ నందు హార్టికల్చర్ ప్రోగ్రాం కింద లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా చేసి ప్రతి రైతుకు హార్టికల్చర్ ప్లాంటేషన్ జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి క్లస్టర్ సహాయ పథక సంచాలకులు ఎన్.శ్రీనివాసులు, కలికిరి, పీలేరు, కేవీ పల్లి, వాయల్పాడు మండలాల ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, సీఎల్ఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

పెద్దమండెం మే 22 ప్రభాతవార్త



ఆరోగ్యం కోసం మనిషి జీవితంలో యోగ ఒక భాగం కావాలని ఎంపీడీవో శ్రీధర్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో మండల అధికారులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకోవాలన్నారు. దీని ద్వారా మానవ శరీరం ఆరోగ్యానికి మంచి ఉపశమనమన్నారు. ప్రతి ఒక్కరూ రోజు ఒక గంట పాటు యోగ చేయడంతో శరీరంలో అన్ని అవయాలకు ఆక్సిజన్ సరఫరా ఈ మనిషి ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని కొనియాడారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తచ్చిన మహనీయుడు మన ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతి పంచాయతీలలో ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వారి చేత యోగ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

## మినీ మహానాడు తెలుగు తమ్ముళ్లు

సిద్ధవటం మే 22 ప్రభాతవార్త



మినీ మహానాడుకు రాజంపేటకు భారీగా తరలివెళ్లిన సిద్ధవటం మండలం తెలుగు తమ్ముళ్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివరపు మోహన్ రెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జి దారపునేని దశరథ రామానాయుడు (దశ) మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవహర్ భాష వారు మాట్లాడుతూ గురువారం ఉదయం రాజంపేటలో ఏటీ చంద్ర రెడ్డి కళ్యాణమండపంలో నిర్వహించిన మినీ మహానాడుకు మండలం నుంచి భారీగా తరలి వెళ్లామని వారన్నారు ఈనెల 27 28 29వ తేదీ కడప జరగబోవు మహానాడుకు సిద్ధవటం మండలం నుండి భారీగా తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాకరాపేట సర్పంచ్ ప్రతినిధిప్రతాప్ నాయుడు ఎక్స్ ఎంపీటీసీ శ్రీనివాస నాయుడు మామిడి సుబ్బారెడ్డి వీరనాల రామచంద్ర డాక్టర్ వీరభద్రుడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ముద్దనూరు, మే 21, ప్రభాతవార్త:



మండల పరిధిలోని బొందలకుంట శ్రీ ఆంజనేయ దేవస్థానం, మరియు ముద్దనూరు పట్టణంలోని జమ్మల మడుగు రోడ్డులో వెలసిన వరదాంజనేయ దేవస్థానంలో గురువారం ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి సన్నిధిలో తాళాల భజనలతో అంగరంగ వైభవంగా ఆంజనేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. జయంతి సందర్భంగా బొందలకుంటలో గురు ట్రాన్స్పోర్ట్ అధినేత గుర్రప్ప భక్తులకు అన్నదాన మరియు ముద్దనూరులో ఉమ్మడిశెట్టి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ ముని రాజారెడ్డి, ఎస్వీఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత వరదారెడ్డి, బాలస్వామి రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

లక్కిరెడ్డిపల్లి ,మే 22; ప్రభాత వార్త

అర్హులైన రైతుకు రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు వడ్లమూడి హరినాధ నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ తో కలిసి అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సన్న కారు చిన్న కారు రైతులు కౌలు రైతులు అనేక ఆర్థిక ఇబ్బందులతో వేసిన పంటలకు గిట్టుబాటు రాక పంటలు చేతికి రాక కష్టాలలో ఉన్న రైతులకు బ్యాంకర్ల ద్వారా సకాలంలో రుణాలు మంజూరు మరియు రెన్యువల్ చేయడానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కార్యకర్తలే పార్టీకి బలం : ఎమ్మెల్యే షాజహాన్ భాష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాజరైన కార్యకర్తలు

మదనపల్లి మే 22 ప్రభాతవార్త

కడపలో జరగనున్న మహానాడు వేడుకలకు సన్నాహక మినీ మహానాడు వేడుకలు గురువారంమదనపల్లిలోని పారడైజ్ ఫంక్షన్ హాల్ లో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్ భాష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు నియోజకవర్గంలో నలుమూలాల నుండి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మినీ మహానాడు వేడుకలలో సందడి చేశారు. మినీ మహానాడు వేడుకలలో బీసీ సోదరులు తెలుగుదేశం తమదే అంటూ విజయంలో పాలుపంచుకున్నారు.పట్టణ పురవీధులు పసుపు తోరణాలతో, మినీ మహానాడు బ్యానర్లతో పసుపు మయం అయింది... ఎమ్మెల్యే షాజహాన్ భాషకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ వేదిక వద్దకు తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెల విద్యాసాగర్, మార్పురి సుధాకర్ నాయుడు, మైనార్టీ నాయకులు ఎస్ఏ మస్తాన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు నీలకంఠ, మోడం సిద్ధప్ప, జీకే వెంకట రమణ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పోతబోలు సుధాకర్, రాజపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్‌లు మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గంలో గత 15 సంవత్సరాలుగా పాలిస్తున్న ఇతర పార్టీలను తరిమి కొట్టి తెలుగుదేశం జెండా ఎగరేసిన ఘనత మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా దని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న పాలన భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. అభివృద్ధికి మారుపేరు, క్రమశిక్షణకు మరో పేరు రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తూ సుభిక్షమైన పాలన అందిస్తున్నారని అన్నారు. యువ నాయకులు విద్యాశాఖ మంత్రిగా యువతకి స్ఫూర్తిదాయకమైన లోకేష్ బాబు ఆశయాలకు అనుగుణంగా మదనపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రాణం ఉన్నంతవరకు అండగా ఉంటానని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల అభ్యున్నతే ధ్యేయంగా స్వర్గీయ నందమూరి తారక రాముని దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి నిస్వార్థంగా పని చేస్తానని హామీ ఇచ్చారు, గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా తెలుగుదేశం కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎస్ఎం రఫీ, కౌన్సిలర్ తులసి రామకృష్ణ, పనికర్ రెడ్డి, నవీన్ చౌదరి, చిన్న మహేష్, మాజీ కౌన్సిలర్లు బాబు నాయుడు, రాధమ్మ, పులి మహాలక్ష్మి, లక్ష్మీదేవి, పురుషోత్తం, శ్రీనివాసులు నాయుడు, విజయమ్మ,,భారతీయుడు, జాఫర్బిన్నిషా, జీవి నాయుడు,, జెసిబి వేణు, తలకాయల శీను, డాన్స్ రెడ్డి, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, బెళ్లేరెడ్డి ప్రసాద్, విజయమ్మ, నాగమణి, నందిని రాయల్, ఆర్ఎస్ షంషీర్, నిస్సార్ అహ్మద్, ఆర్ఆర్ వీధి బాబా, జాన్ బాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు




బద్వేల్, మే 22 ప్రభాతవార్త

స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని బడును డాక్టర్ వి మల్లేష్ ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి బద్వేల్ 22న బద్వేల్ నందు సబ్ డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ స్థానిక ఎన్జీవో నందు నిర్వహించడమైనది, ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లె పట్ట ణ ఆరోగ్య కేంద్రం సురేంద్ర నగర్ కోటవీధి గాంధీ నగర్, మరియు స్త్రీ వ్యాధి నిపుణులు మరియు, చిన్నపిల్ల వ్యాధుల నిపణులు, రేడియాలజిస్టు స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారిని సమావేశపరచి పి.సి.పి ఎన్ 1994 చట్టం పైన డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి మల్లేష్ అవగాహన కల్పించడమైనది, ప్రైవేట్ మరియు గవర్నమెంట్ ఆసుపత్రుల్లో స్కానింగ్ సెంటర్ నందు లింగ నిర్ధారణ జరిగినట్లయితే కఠినమైన చర్యలు తీసుకొనబడునని పేర్కొన్నమైనది, అనంతరం స్కానింగ్ సెంటర్ ఇన్‌స్పెక్షన్ చేయడామైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.వినయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు,డాక్టర్ శరత్చంద్ర, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొనడం అయినది.

# మహానాడు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



కమలాపురం మే22 ప్రభాత వార్త

నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం ఔటర్ రింగ్ రోడ్ పబ్బాపురం పొలంలో మహానాడు సభ ఈ నెల 27, 28, 29 తేదీల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను గురువారం కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి పరిశీలించారు. ప్రాంగణంలోని మైదాన అభివృద్ధి, వేదికలు, సాంకేతిక ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించగా, ఆయా ఏర్పాట్లు సమయానికి పూర్తి కావాలని, కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచనలు ఇచ్చారు. మహానాడును ప్రజల ఆకాంక్షలకు, పార్టీ కార్యకర్తల ఉత్సాహానికి తగిన విధంగా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఏర్పాటును సమగ్రంగా పర్యవేక్షిస్తున్నాము. పార్టీలో ప్రతి కార్యకర్తకు గౌరవం ఉంటుంది, ప్రజల ఆకాంక్షలకు ముఖ్యమైన ప్రాధాన్యత ఇస్తాం, అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహా భారతం సందర్భంగా విరాళం



చిన్నమండెం మే 22 ప్రభాత వార్త :

మండలంలో నిర్వహించే మహాభారతం సందర్భంగా లక్ష 16 వేల రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మహాభారతం నిర్వహకులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహాభారతానికి జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరు అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాటు చేయాలని మహాభారతం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

సుండుపల్లి, మే 22, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పెద్దబలిజపల్లి గ్రామంలోని గుట్టకాడబలిజపల్లి నందు దేవరగుట్ట పై వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి కార్యక్రమంలో భాగంగా సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం జనసేనపార్టీ సీనియర్ నాయకులు రామ శ్రీనివాస్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రతిఒక్కరికి అందాలని వేడుకున్నారు తదనంతరం దాతల సహకారంతో అన్న సంతర్పణ నిర్వహణలో భక్తాదులకు బోజనాలను వడ్డించారు. అలానే స్వామి వారి తిరుణాల పురస్కరించుకుని రాత్రికి విద్యుత్ దీపాలంకరణలతో కోలాటం డిజె డప్పు వాయిద్యాలు బాణసంచాలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా తిరుణాల జరుపుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయఅర్చకులు కమిటీసభ్యులు కార్యనిర్వాహకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# జగన్ ముద్రను చెరిపేసేందుకే సంక్షేమ పథకాల రద్దు



మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ధ్వజం

ప్రొద్దుటూరు మే 22 ప్రభాతవార్త

రాష్ట్రంలో సామాన్య ప్రజలకు సౌకర్యవంతంగా సంక్షేమ పథకాల సేవలను అందించేందుకు గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సంక్షేమ పథకాలను అమలుపరచగా నేటి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనసుల్లో జగన్ ముద్రను చెరిపేసేందుకే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోగా నాడు సామాన్య ప్రజా ప్రయోజనాల జగన్ ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తుందని విమర్శించారు. ప్రధానంగా సామాన్య ప్రజలకు వివిధ రకాలైన సేవలు అందించేందుకు జగన్ వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజా మన్ననలు పొందారన్నారు. గత ఎన్నికలలో చంద్రబాబు వాలంటీర్ వ్యవస్థలు కొనసాగిస్తారని ఐదు నుండి 10 వేల వరకు గౌరవ వేతనం పెంచి ఇస్తారని హామీ ఇచ్చి నేడు వాలంటీర్ వ్యవస్థనే రద్దు చేశారన్నారు దీనివల్ల ప్రజలు అనేక రకాలుగా జనన, మరణ, కుల ఆదాయ, కుటుంబ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే ఇంటికి నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా పదివేలకు పైగా జగన్ ప్రారంభించారని దానివల్ల ప్రభుత్వం అందించే బియ్యము తదితర అత్యవసర వస్తువులను ఇంటి దగ్గరికి వచ్చి పంపిణీ చేసేవారన్నారు. కానీ చంద్రబాబు ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కి ప్రజా పంపిణీ వాహన వ్యవస్థను రద్దు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచేందుకు చెత్త సేకరణ వాహనాలను జగన్ ప్రవేశపెడితే అందుకు భిన్నంగా చంద్రబాబు వాటిని రద్దుచేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం సెంట్రల్ సిలబస్ జగనన్న గోరుముద్ద లాంటి పథకాలను నిర్వీర్యం చేసి రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి జగన్ సంస్కరణలు చేపడితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసినా పాఠశాలలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ప్రతి ఒక్కరికి చికిత్సలు అందించేందుకు జబ్బుల సంఖ్యను పెంచి ఆరోగ్యశ్రీ పథకాన్ని జగన్ పటిష్టపరిస్తే చంద్రబాబు ఆ పథకానికి నీరు కారుస్తున్నారన్నారు. దీని బట్టి చూస్తే కేవలం జగన్ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజల మనసుల్లో నిలిచిపోతారన్న దురుద్దేశంతో జగన్ ముద్రను చెరిపేసేందుకే చంద్రబాబు పలు సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని విమర్శించారు ఇంకా నాలుగు సంవత్సరాలు పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ప్రజా ప్రయోజనాలు తుంగలో తొక్కే కూటమి ప్రభుత్వ చర్యలపై నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ సిఎస్ ఖాజా మొహిద్దిన్ కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి గుర్రం లావణ్య మన్నే సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కూలీలతో మంత్రి



చిన్నమండెం, మే 22 ప్రభాతవార్త :

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం మండలంలోని వండాడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కూలీలతో పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు బిల్లులు సకాలంలో అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో అర్హులందరూ ఉపాధి పనులకు వచ్చే విధంగా తోటి కూలీలు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేసి పనులు కల్పించడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.

# ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

బ్రహ్మంగారిమఠం మే 22 ప్రభాతవార్త:



తిరుమల తిరుపతి దేవస్థానం,ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని బద్వేల్ రోడ్డులో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానము నందు హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, తమలపాకు పూజలు మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హను మాన్ వైభవాన్ని గురించి వక్తలు ప్రసంగించారు.ఈ సందర్భంగా భజనలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం గావించారు.ఈ కార్యక్రమంలో చాపాడు వెంకటసుబ్బారెడ్డి,దేవాలయ నిర్వాహకులు నాగయ్య,ప్రోగ్రాం అసిస్టెంట్ కడప గోపి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చెన్నారెడ్డి కృష్ణారెడ్డి,నాగిరెడ్డి,పెంచల్ రెడ్డి,రామిరెడ్డి,నాగేశ్వరరావు, రామసుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణానికి రూ. 50,000 విరాళం

పోరుమామిళ్ల రూరల్, మే 22 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల మండలం మూలవీధి రామాలయ నిర్మాణమునకు గురువారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ 50, 000 రూపాయలు విరాళం ఇచ్చారు. ఇందుకుగాను మూలవీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# భక్తిశ్రద్ధలతో హనుమజయంతి వేడుకలు



పీలేరు మే 22 ప్రభాతవార్త :

పీలేరులో హనుమ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఎర్రంరెడ్డి గుట్టలో వెలసిన శ్రీశ్రీశ్రీ అభయహస్త ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకం, వడపూజ, ఆకుపూజ, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో మంగళ వాయిద్యాలు, బాజా భజంత్రీలతో ఆలయం నుంచి స్థానిక ప్రకాశం రోడ్డు, నెహ్రూ బజారు, బ్రాహ్మణ వీధి, పాత బస్టాండు మీదుగా పట్టణంలో ఊరేగింపును చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీశ్రీశ్రీ అభయహస్త ఆంజనేయ స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమాల్లో జడ్పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, ఏటి వెంకటశివారెడ్డి, ఎంపీటీసీ జైపాల్ రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు శ్రీనాథ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మార్కొండారెడ్డి, హరి ప్రసాద్, పెద్దోడు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. లక్ష్మీనారాయణ, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సదుం రోడ్డులో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, శ్రీనాథ్ రెడ్డి ఫ్లాట్స్ లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం, మండలంలోని గూడరేవుపల్లి పంచాయితీ, గూడరేవుపల్లిలో ప్రతిష్టించిన పెద్ద బండ ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమ జయంతి సందర్భంగా విశేష పూజ, అలంకరణలు, ఊరేగింపు, భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ పూజలలో గూడరేవుపల్లి గ్రామ ప్రజలు, పీలేరు పట్టణ ప్రజలు, ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ హనుమజ్జయంతి వేడుకలు

ఒంటిమిట్ట మే 22( ప్రభాతవార్త)



శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలో అతి పురాతనంగా చెరువుకట్టపై వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని పచ్చటి మామిడి తోరణాలతో అరటి పిలకలతో దేదీప్యమానంగా అలంకరించడం జరిగింది. అనంతరం వేకువజామున మండల పురోహితులు మరియు శ్రీ కోదండ రామాలయ ఆస్థాన పురోహితులు ఏలేశ్వరం .గురుస్వామి శర్మ సూచనల సలహాల మేరకు ఆయన పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఏలేశ్వరం. బాల గురునాథ శర్మ( బాలు స్వామి), అదనపు అర్చకులు ఏలేశ్వరం. గురు దీక్షిత్ శర్మ వీరాంజనేయ స్వామి మూలవిరాట్యుకు వైదిక సంప్రదాయ పద్ధతిలో శ్రీ సూక్త, పురుష సూక్త, మన్య సూక్త ప్రకారంగా పంచామృత అభిషేకాలు, నిర్వహించి నూతన వస్త్రాలతో, పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించి ఆలయానికి వస్తున్న భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించడం జరిగింది. పర్వదిన సందర్భంగా గ్రామస్తులే కాకుండా మండలానికి చెందిన ప్రజలు ఆలయానికి తరలివచ్చి వారి వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.




# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు,



మైదుకూరు, మే 22, ప్రభాతవార్త:

మున్సి పాలిటీ పట్టణంలో వెలసిన నూతన హనుమాన్ సన్నిధి నందు ఉదయం నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మహిళలు దంపతులు పాల్గొని స్వామివారికి అలంకరణ, పూజలు, ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించారు. భక్తులకు పానకం వడపప్పు కార్య నిర్వహకులు భక్తులకు ఇవ్వడం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, కార్య నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




# వైభవంగా అభయాంజనేయస్వామి జయంతి వేడుకలు

:తెల్లవారుజామునుంచే స్వామిని దర్శించుకున్న భక్తులు : పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి

బద్వేలు అర్బన్,మే 22,ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు హనుమాన్ జయంతి వేడుకలునిర్వహించడం జరిగింది. 21వ తేది నుంచే మొదలైన ఈ ఉత్సవాలలో సాయంత్రం 5 గంటలకు పంచామృత శుద్ధోదక అభిషేకం, అష్టోత్తర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే 22వ తేది గురువారం ఉదయం 6 గగంటలకు స్వామివారికి ప్రత్యేక అలంకారముతో దర్శనం, 10 గంటలకు లక్ష్మి గణపతి హోమము, నవగ్రహ హోము, లక్ష్మినారాయణ హోమము, ఆయుష్య హోమము, లక్ష్మి కుభేర హోమము, మహానైవేద్యము, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు ఆలయ ధర్మకర్త వల్లంకొండు వెంకటరమణ, ఆలయ అర్చకులు వీరేశాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం హనుమాన్ వ్రతం విశిష్టత గురించి వీరేశాచార్యులు పలువురికి వివరించారు.అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా వివిధ వేష దారుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవాన్ని భక్తులు తిలకించడంతో పాటు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు స్వామివారిని దర్శించుకున్న వారిలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి,రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, వార్త సర్క్యులేషన్ మేనేజర్ వేంకటేశ్వరరావు, ఏపీయూడబ్ల్యుజే అధ్యక్షులు వెంకటేష్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి. సుబ్బారావు, రామనబోయిన మురళి యాదవ్, సతీమణి సునీత తదితరులు స్వామివారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. స్వామివారి ఉత్సవాలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.





# వైభవంగా పాటెమ్మ తిరునాళ్ల

పెండ్లిమర్రి, మే 22, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామంలో వెలసిన పాటెమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయం సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నర్వహించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు శివారెడ్డి చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై బందోబస్తు నిర్వహించారు.

